క్లుప్తంగా

ఆక్రమణలు తొలగించాలి

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ గ్రామంలో ప్రభుత్వ భూమిలో నెలకొన్న ఆక్రమణలు తొలగించాలని గ్రామానికి చెందిన బొడ్డు ఎల్లాజి కోరారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో తహసీల్దారు ఎస్.వి.రమణను మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 44-2లో 36 సెంట్ల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆక్రమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే ఫారం-6, ఫారం-7లను జారీ చేసినా ఆక్రమణలు తొలిగించలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సన్మానం



కార్యదర్శి రామ్‌జీని సత్కరిస్తున్న వైస్ ఎంపీపీ వైకుంఠంనాయుడు తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామ సచివాలయం నుంచి బదిలీపై వెళ్లిన ఉద్యోగులను అదే గ్రామంలో మంగళవారం సన్మానించారు. ఇదే కార్యక్రమానికి హాజరైన వైస్ ఎంపీపీ సారిక వైకుంఠంనాయుడు..వారిని దుశ్శాలువాతో సత్కరించిన అనంతరం వారి సేవలను ప్రశంసించారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వచ్చాయని, మనం ఎక్కడ పనిచేసినా బాగా పనిచేయాలని మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ అలుగోలు బంగారమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆల్తి ఆదినారాయణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట సచివాలయంలో బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను మంగళవారం సత్కరించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, నాయకులు రాంబార్కి రామారావు, అట్టాడ శ్రీను, నడుపూరి పరిశినాయుడులు ఈ కార్యక్రమానికి హాజరై, ఉద్యోగులను సన్మానించి వారి సేవలను ప్రశంసించారు. మనం చేసిన సేవలే మనకు గుర్తింపునిస్తాయని, ఎక్కడ పనిచేసినా బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గురాన చక్రి, త్రినాధరావు, శ్రీరామ్, కార్యదర్శి బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



గోవిందపురం వద్ద నిల్వ చేసిన ఇసుక పోగు

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురం, రెల్లివలసల నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. రెల్లివలస సమీపంలోని చంపావతి నది, కందివలస గెడ్డల నుంచి ఇసుకను ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నారు. నిత్యం ట్రాక్టర్ల ద్వారా తరలించి స్టాక్ పాయింట్‌ల వద్ద నిల్వ చేసి లారీల్లో లోడు చేసి విక్రయాలు కొనసాగిస్తున్నారు. విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి తదితర ప్రాంతాలకు ఇక్కడి నుంచే ఇసుక తరలిస్తున్నారు. గత కొంతకాలంగా ఇలా అక్రమంగా ఇసుక తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

- ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్

విజయనగరం గంటస్తంభం: నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని కూటమి ప్రభుత్వాన్ని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్ ప్రశ్నించారు. ఇదే విషయమై నగరంలోని సీపీఐ అమర్ భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల సమయంలో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు లేదా నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఆ హామీ అమలు ఊసెత్తకపోవడం దుర్మార్గమన్నారు. నిరుద్యోగుల నుంచి ఓట్లు దండుకుని ఇలా వారికిచ్చిన హామీ అమలు చేయకుండా కాలయాపన చేయడం తగదన్నారు. ఎంతోమంది నిరుద్యోగులు కాంపిటేటివ్‌కు ప్రిపేర్ అవుతూ కోచింగ్ సెంటర్లలో ఉన్నారని, నిరుద్యోగ భృతి కింద ఎంతో కొంత ఇస్తే వారికి సాయంగా ఉంటుంది కదా అని అన్నారు. ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని, ముఖ్యంగా నిరుద్యోగులకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోబోమని, పెద్దఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బూర వాసు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కూటమి విఫలం

- బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకటరాజేష్, నగర అధ్యక్షుడు ఆశపు వేణు



బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

విజయనగరం: ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకటరాజేష్, నగర అధ్యక్షుడు ఆశపు వేణు విమర్శించారు. నగరంలోని 37, 38, 42, 43 డివిజన్లలో మంగళవారం జరిగిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఇంటింటికీ వెళ్లి, కూటమి మోసాలను ప్రజలకు వివరించారు. ఆ తర్వాత ఆయా డివిజన్లలో జరిగిన సమావేశాల్లో చంద్రబాబు మోసపూరిత పాలనపై మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి 14 నెలల కాలం గడుస్తున్నా ఎన్నికల హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తూ నమ్మిన ప్రజలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఎన్నికలప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలకు రెండింతలు ఎక్కువ ఇస్తామని మభ్యపెట్టి ఓట్లు వేయించుకున్నారని, తీరా అధికారంలోకి వచ్చాక హామీల అమలులో చేతులెత్తేశారని విమర్శించారు. ఇప్పటి వరకు ఇచ్చిన గ్యాస్, తల్లికి వందనం పథకాలు కూడా అరకొరగానే ఉన్నాయన్నారు. మొదట్లో ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు అని చెప్పారని, ఇప్పుడు ఏడాదికి మూడు సిలిండర్లు మాత్రమే ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారన్నారు. తల్లికి వందనం డబ్బులు కూడా ఒక్కొక్కరికి ఒక్కో విధంగా పడ్డాయన్నారు. ఎన్నికల ప్రచారంలో రూ.15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ.13 వేలు ఇచ్చారని, అది కూడా చాలామందికి పడలేదన్నారు.

ప్రశ్నిస్తే కేసులు..

ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను ప్రశ్నించిన వారిపై అక్రమంగా కేసులు పెట్టి అరెస్ట్ చేస్తున్నారన్నారు. కూటమి అధికారం చేపట్టిన దగ్గర నుంచి ఎంతోమంది ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సోషల్ మీడియా యాక్టివిస్టులు జైలుపాలయ్యారని, మరెంతోమంది భౌతికదాడులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి లేదు.. సంక్షేమమూ లేదన్నారు. శాంతిభద్రతలు కూడా క్షీణించాయన్నారు. ఆడబిడ్డలకు కనీస భద్రత లేదన్నారు. ఎప్పుడూ కక్ష సాధింపు చర్యలే కనిపిస్తున్నాయి తప్ప ప్రజలకు ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని, హామీలు అమలుచేసేంత వరకు ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. ప్రజలు కూడా అప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర ఉపాధ్యక్షుడు రెడ్డి గురుమూర్తి, కార్పొరేటర్లు తొగరోతు సంధ్యారాణి, పిన్నింటి కళావతి, దాసరి సత్యవతి, సీనియర్ నాయకులు వీఎస్ ప్రసాద్, బొబ్బాది త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ హాస్టల్ విద్యార్థుల నిరసన



యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద విద్యార్థుల నిరసన

విజయనగరం క్రైమ్/విజయనగరం గంటస్తంభం: జేఎన్‌టీయూ జీవీ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ గదులకు తాళాలు వేయడంపై విద్యార్థులు మంగళవారం రాత్రి ఆందోళనకు దిగారు. కొన్ని గదుల్లో ఉన్న విద్యార్థులను హాస్టల్ సిబ్బంది బలవంతంగా ఖాళీ చేయించి తాళాలు వేశారంటూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తాళాలు తీసి విద్యార్థులకు వసతి కల్పించాలని, తాళం వేసిన సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలంటూ యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలో 3వ సంవత్సరం పూర్తి చేసి నాలుగో సంవత్సరంలోని వచ్చిన కొంతమంది విద్యార్థులు హాస్టల్ గదులను అలాట్ చేయించుకోకుండా కొన్ని రోజులుగా వసతి గదుల్లో ఉంటున్నారన్నారు. గడచిన ఏడాది బిల్లు కూడా చెల్లించకుండా హాస్టల్‌లో అనధికారికంగా వసతి పొందుతున్నారన్నారు. కొన్ని రోజులుగా చెబుతున్నా విద్యార్థులు పట్టించుకోవడం లేదని, ఆ గదులను ఖాళీ చేయించి తాళాలు వేశామని చెప్పారు. హాస్టల్ వార్డెన్ విద్యార్థులతో చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ లక్ష్మణరావు, ఎస్ఐ అశోక్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు.

ప్రజాసమస్యలు పట్టవా?

- నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశంలో అధికారుల తీరుపై సభ్యుల మండిపాటు



ఎమ్మెల్యే ఎదుట సమస్యలపై అధికారులను నిలదీస్తున్న 16వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి సత్యనారాయణ

నెల్లిమర్ల రూరల్: మండల కేంద్రంలోని నగర పంచాయతీ కార్యాలయంలో నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజులు ఈ సమావేశానికి హాజరు కాగా నగర పంచాయతీలోని వివిధ వార్డుల్లో నెలకొన్న ప్రజాసమస్యలపై కౌన్సిల్ సభ్యులు ధ్వజమెత్తారు. స్వపక్షంలో విపక్షమన్నట్లుగా సమావేశం ఆద్యంతం సమస్యల పరిష్కారంపై చర్చ సాగింది. పలు వార్డుల్లో కొన్నాళ్లుగా తిష్ఠ వేసి ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు టీడీపీ, జనసేన పార్టీల కౌన్సిలర్లు మండిపడ్డారు. తీర్మానాలకు మాత్రమే కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారని, ఆచరణలో శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ దీపాలు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, లోఓల్టేజీ సమస్యలను ప్రధానంగా సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేశామని అధికారులు చెబుతున్నారని, దాని కోసం నిధులు ఎంత ఖర్చు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 16వ వార్డులో లోఓల్టేజి సమస్య వేధిస్తోందని, కనీసం వీధిదీపాలు కూడా వెలగడం లేదన్నారు.

ప్రజలు తిడుతున్నారు..

పారిశుధ్య పనులు సక్రమంగా లేవని జనం తిడుతున్నారని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల ఏడో వార్డులో తాను పర్యటించానని కేవలం తన పర్యటన ఉందనే అక్కడ పారిశుధ్య పనులు చేశారని అక్కడి మహిళలు చెప్పారని తెలిపారు. పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రత్యేకంగా నిధులు కేటాయించినా ఎందుకు పనులు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా అన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా చొరవ తీసుకోవాలన్నారు. అలాగే నగర పంచాయతీ అభివృద్ధికి చిత్తశుద్ధి, నిబద్ధతతో పని చేయాలని కోరారు. ఇదిలా ఉంటే ఎప్పటిలాగే సమావేశంలో అనధికార సభ్యులే హడావిడి చేశారు. మహిళా కౌన్సిలర్లకు బదులుగా వారి భర్తలు సమావేశానికి ప్రతినిధులుగా హాజరై ప్రసంగాలు ఇవ్వడం, అజమాయిషీ చెలాయించడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. కార్యక్రమంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, కమిషనర్ జయరాం తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు

విజయనగరం గంటస్తంభం: కూటమి ప్రభుత్వం తీసుకువస్తున్న ఔట్‌సోర్సింగ్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ కొత్తగా తీసుకువస్తున్న ఔట్ సోర్సింగ్ విధానాన్ని నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని కార్మికులపై బలవంతంగా ప్రభుత్వం రుద్దుతోందని, దీన్ని వ్యతిరేకిస్తూ అక్కడి కార్మికులు 18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. వారి సమ్మెకు తమ మద్దతు తెలుపుతున్నామన్నారు. వారి సమస్యలను పరిష్కరిచాల్సిన పాలకవర్గం, ప్రభుత్వమే అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, లాఠీచార్జిలతో హింసించడం దుర్మార్గమన్నారు. తక్షణమే ప్రభుత్వం కొత్తగా తీసుకువద్దామనుకుంటున్న ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ, మున్సిపల్ కార్మికులు భాస్కరరావు, రామచంద్రరావు, సూరి, రమణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న ఐదుగురు అరెస్ట్

విజయనగరం క్రైమ్: నగరంలో గంజాయి తాగుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని సీఐ చౌదరి మంగళవారం తెలిపారు. ఈ నెల 28న సాయంత్రం గూడ్స్‌షెడ్ డీఎస్పీ కార్యాలయం వద్ద గంజాయి తాగుతూ అర్జున్ సింగ్, రోషన్ సింగ్‌లు పట్టుబడగా ప్రదీప్‌నగర్‌లో మరో ముగ్గురు గంజాయి సేవిస్తూ దొరికారన్నారు. అర్జున్‌సింగ్, రోషన్‌సింగ్‌లది ఉత్తరప్రదేశ్‌గా తెలుస్తోందన్నారు.

ఘనంగా ప్రమాణ స్వీకార మహోత్సవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న కామర్స్ ఆఫ్ చాంబర్స్ కొత్త కమిటీ సభ్యులు

విజయనగరం అర్బన్: స్థానిక మెసానిక్ టెంపుల్ వద్ద చాంబర్ ఆఫ్ కామర్స్, విజయనగరం సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశిష్ట అతిథిగా ప్రముఖ వ్యాపారవేత్త కంకటాల మల్లిక్ హాజరయ్యారు. వారి సమక్షంలో కామర్స్ కొత్త అధ్యక్షుడిగా కాపుగంటి శ్రీనివాస్, కార్యదర్శిగా బొడ్డు శ్రీనివాస్, కోశాధికారిగా ప్రవీణ్ అంచాలియా సహా మరో తొమ్మిది మంది వైస్ ప్రెసిడెంట్లు, ఇంకో తొమ్మిది మంది జాయింట్ సెక్రటరీలు ప్రమాణ స్వీకారం చేసి, పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు వారికి మంత్రి, వ్యాపారవేత్త, ఇతరులంతా అభినందనలు తెలిపారు. వ్యాపారులపై జీఎస్టీ, ప్రాపర్టీ టాక్స్ భారం పడకుండా ప్రభుత్వం రక్షణ కల్పించాలని కామర్స్ కొత్త అధ్యక్షుడు కాపుగంటి శ్రీనివాస్ మంత్రిని కోరారు. వ్యాపార సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను చాంబర్ తరఫున పరిష్కరించేలా కొత్త కార్యవర్గం ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం గత మూడేళ్లలో చాంబర్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను వీడియో రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో రవ్వా శ్రీనివాస్, పీఏసీసీ నాగేశ్వరరావు, చంద్రశేఖర్, ప్రసాద్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోండి



రైతులకు మినుముల విత్తనాల కిట్లు అందజేస్తున్న ఏవో నీలిమ

పూసపాటిరేగ: ప్రతి రైతు పంటల బీమా చేయించుకోవాలని ఏవో కె.నీలిమ సూచించారు. మండలంలోని వెంపడాం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి, ఖరీఫ్ వరి సాగుపై అవగాహన కల్పించారు. ఆగస్టు 15వ తేదీలోగా వరినాట్లు వేసిన తర్వాత ఆ పంట బీమా పొందేందుకు ఎకరాకు రూ.200 చొప్పున చెల్లించి, పంటల బీమా చేయించుకోవాలని తెలిపారు. అలాగే ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఇవన్నీ చేస్తేనే పంట రుణాలు, ధాన్యం కొనుగోళ్లు, ఇన్‌పుట్ సబ్సిడీ వంటివి లభిస్తాయన్నారు. అనంతరం మినుము విత్తనాల కిట్లను రైతులకు అందజేశారు. ఆమె వెంట వీఏఏలు వాగ్దేవి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో శ్రీలక్ష్మి పాల్గొని, వరి, మొక్కజొన్న పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయంలో జరిగిన సమావేశంలో రైతులకు పలు సూచనలు చేశారు. పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ సాగు విధానంపై దృష్టి సారించాలని ఆమె తెలిపారు. అలాగే ప్రకృతి వ్యవసాయానికి రైతులు ఆసక్తి చూపాలని, ప్రకృతి సేద్యం ద్వారా ఆరోగ్యవంతమైన పంట, అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఈ నెల 31వ తేదీలోపు మొక్కజొన్న పంటకు.. ఆగస్టు 15వ తేదీలోపు వరి పంటకు సంబంధించి పంటల బీమా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం, సర్పంచ్ బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఉపాధ్యాయుడు ఐదుగురిని దత్తత తీసుకోవాలి

- తల్లిదండ్రుల సమావేశంలో డీఈవో మాణిక్యంనాయుడు



మాట్లాడుతున్న డీఈవో మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: ప్రతిరోజూ పిల్లలను పాఠశాలకు పంపించాలని డీఈవో యు.మాణిక్యంనాయుడు సూచించారు. స్థానిక పూల్‌బాగ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడం సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఐదుగురు విద్యార్థులను దత్తత తీసుకుని వారికి చదవడం, రాయడం నేర్పించడంతో పాటు పాఠశాలకు హాజరు కాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేయడం లేదా వారి ఇంటికి వెళ్లి పిల్లలను పాఠశాలకు తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రఘురామరాజు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ అనిత, ఉపాధ్యాయులు డి.ఈశ్వరరావు, వి.కృష్ణ, షేక్‌అనీష్, చూడామణి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అవసరానికి మించి ఎరువులు వాడొద్దు

- కలెక్టర్ అంబేడ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: అవసరానికి మించి ఎరువులు వాడొద్దు కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో మంగళవారం వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది జూలై నాటికి 19 వేల హెక్టార్లలో పంటలు సాగువ్వగా ఈ ఏడాది సుమారు 33 వేల హెక్టార్లలో సాగైనట్టు వెల్లడించారు. సుమారు 30 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి వరకు 21 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులు వినియోగించారన్నారు. మరో 6 వేల టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. 10 వేల టన్నుల యూరియా త్వరలో రాబోతుందని తెలిపారు. ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి రావాలంటే వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన విధంగా ఎరువులు వాడాలన్నారు. నానో యూరియా వినియోగం పంటకు మేలని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ నాగార్జున, వ్యవసాయశాఖ జేడీ తారకరామారావు, సీపీఓ బాలాజీ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● ఆకట్టుకున్న కోలాటం



విజయనగరం జిల్లా కేంద్రంలోని పైడితల్లి దేవస్థానం వద్ద ఉన్న ఆధ్యాత్మిక కళావేదికపై మంగళవారంమహిళలు, చిన్నారులు చేసిన కోలాటం ఆకట్టుకుంది. దాసన్నపేటకు చెందిన 20 మంది సభ్యులతో కూడిన కాళీమాతా కళాకారుల బృందం చేసిన కోలాట ప్రదర్శన ఆద్యంతం చూపరులను మంత్రముగ్ధుల్ని చేసింది. -సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

హాస్టల్ విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూసుకోవాలి



విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణప్రసాద్

నెల్లిమర్ల రూరల్: హాస్టల్ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతిగృహాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. వసతిగృహంలోని గదులు, మరుగుదొడ్లు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వసతిగృహ పరిసరాలు, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని తెలిపారు. అలాగే చట్టాలపై అవగాహన కల్పించి, విద్యార్థులను చైతన్యవంతులను చేయాలన్నారు.